ప్రజాశక్తి
సోమవారం 20 మార్చి 2023
5
పార్వతీపురం మన్యం

యథాతథంగా నేడు స్పందన

ప్రజాశక్తి - కలెక్టరేట్

స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం యథాతథంగా కొనసాగుతుందని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం పునఃప్రకటన విడుదల చేశారు. దీన్ని అధికారులు, ప్రజలు గుర్తించాలని ఆయన కోరారు. అలాగే స్పందన కార్యక్రమానికి అన్ని విభాగాల అధికారులు హాజరు కావాలని ఆదేశించారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో సోమవారం గిరిజన స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఐటిడిఎ పిఒ బి.నవ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఈ విషయాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు.

అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సోమవారం చేపట్టే చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లా వ్యాప్తంగా అణచివేత చర్యలకు, నిర్బంధాలకు దిగారు. చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లనీయకుండా పోలీసులు ఆదివారం ఉదయం నుంచి అంగన్వాడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, ముఖ్య కార్యకర్తల ఇళ్లకు వెళ్లి, బయటకు రాకుండా గృహనిర్బంధాలకు దిగారు. ఎక్కడికక్కడే అరెస్టులకు పాల్పడి, భయభ్రాంతులకు గురిచేశారు.

- 'చలో విజయవాడ'ను భగ్నం చేసేందుకు యత్నం
- జిల్లా వ్యాప్తంగా గృహ నిర్బంధాలు
- బొబ్బిలిలో 30మంది అరెస్టు

అంగన్వాడీలపై ఉక్కుపాదం

బొబ్బిలి రైల్వేస్టేషన్ వద్ద అంగన్వాడీలను అరెస్టు చేసి ఆటోలో తరలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

అంగన్వాడీలు సోమవారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి అంగన్వాడీలను వెళ్లనీయకుండా పోలీసులు ఆదివారం ఉదయం నుంచి అంగన్‌వాడీ నాయకులు, ముఖ్య కార్యకర్తల ఇళ్లకు వెళ్లి వారిని ఇంట్లో నుంచి బయటకు రాకుండా పోలీసులు గృహ నిర్బంధం చేశారు.. పార్వతీపురంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిర, సిఐటియు జిల్లా కోశాధికారి జివి రమణను గృహనిర్బంధం చేశారు. అలాగే అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి, నాయకులు జయమ్మ, ప్రభావతి, అమరవేణి, హిమప్రభ తదితరులను గృహనిర్బంధం చేశారు. చలో విజయవాడకు వెళ్లేందుకు బొబ్బిలి రైల్వేస్టేషన్‌కు వెళ్లి అంగన్‌వాడీ కార్యకర్తలు 30మందిని పోలీసులు అరెస్టు చేశారు. విజయనగరం జిల్లా వ్యాప్తంగా 91మందిని అరెస్టు చేశారు.

సాలూరు : సోమవారం తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమం నేపథ్యం లో ఆదివారం సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, మండల నాయకులు ఎం.శ్రీనివాసరావును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాల అణిచివేత విధానాలను విడనాడి వెంటనే హామీలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

కొమరాడ : చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, అంగన్‌వాడీ నాయకులు జయమ్మను పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి పోలీసుల అక్రమ నిర్బధాన్ని ఖండించారు.

పోరాటాలు అణచివేస్తే ప్రజలే తగిన బుద్ధి చెప్తారు : సిపిఎం

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ తలపెట్టిన సోమవారం తలపెట్టిన చలో విజయవాడకు కార్యకర్తలు, నాయకులు వెళ్లకుండా పోలీసులచే ప్రభుత్వం అడ్డుకోవడం అమానుషమని, బలవంతంగా పోరాటాలని అణిచివేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు జి.వెంకటరమణ, వి.ఇందిర హెచ్చరించారు. చలో అసెంబ్లీని భగ్నం చేసేందుకు ఆదివారం తెల్లవారుజాము 5గంట నుంచి జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలు, సిఐటియు, సిపిఎం నాయకులు ఇళ్ల వద్ద గృహ నిర్బంధాలు అన్యాయమని, సిఐటియు కార్యాలయానికి సమావేశానికి వస్తే ఆఫీస్ వద్ద పోలీసులు కాపలా కాశారని, రాజ్యాంగం కల్పించిన ధర్నాలు, నిరసనలు తెలిపే హక్కును కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రజా ఉద్యమ నాయకుల ఇళ్లకు వచ్చి బెదిరింపులు, గాలింపు చర్యలకు పాల్పడుతూ ప్రజల్లో భయం సృష్టించడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్యావంతులు గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుద్ధి చెప్పినా జగన్ ప్రభుత్వానికి చలనం లేదని ఈ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యల్ని ప్రజలంతా ఖండించాలని కోరారు.

అంగన్వాడీలపై నిర్బంధం ఆపాలి : సిఐటియు

అంగన్వాడీలపై నిర్బంధం ఆపాలని, ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, యమ్మల మన్మధరావు అన్నారు. జిల్లాలో పలుచోట్ల అంగన్వాడీలను, సిఐటియు నాయకులను పోలీసులు గృహనిర్బంధాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి, తెలంగాణ కంటే అదనంగా జీతం పెంచుతామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి నాలుగేళ్లయినా ఇంతవరకూ ఒక్క రూపాయి జీతం పెంచలేదనిన్నారు. పైగా అంగన్వాడీలపై పర్యవేక్షణ పేరుతో వేధింపులు, ఒత్తిళ్లతో మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి విన్నవించడం కోసం విజయవాడకు బయలుదేరిన అంగన్‌వాడీ, సిఐటియు నాయకుల ఇళ్లకు పోలీసులు వెళ్లి గృహ నిర్బంధం చేయడం, నోటీసులు జారీ చేసి భయభ్రాంతులకు గురి చేయడం మానుకోవాలని హితవు పలికారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయలేని ప్రభుత్వం నిర్బంధానికి పూనుకోవడం సిగ్గుచేటన్నారు. పోలీసుల చర్యలకు సిఐటియు సీతానగరం మండల కార్యదర్శి జివి రమణ ఒక ప్రకటనలో ఖండించారు. ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపితే భవిష్యత్తులో ప్రజలు గట్టి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

పార్వతీపురం, సాలూరులో గృహనిర్బంధంలో ఉన్న సిపిఎం, సిఐటియు నాయకులు రెడ్డి వేణు, వి.ఇందిర, జి.వెంకటరమణ, ఎన్‌వై నాయుడు; కొమరాడ అంగన్‌వాడీ నాయకులు యమున

మల్లు, నంబూద్రి ఆశయాలు సాధిస్తాం

ప్రజాశక్తి - కలెక్టరేట్

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం, మార్కిస్టు మహారధికుడు ఇఎంఎస్ నంబూద్రిపాద్ ఆశయాలను సాధిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. మల్లు స్వరాజ్యం ప్రథమ, ఇఎంఎస్ నంబూద్రిపాద్ 25వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. తొలుత సిపిఎం నాయకులు రెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ ఆనాటి దొరల, జమీందారుల వెట్టి చాకిరి విధానానికి వ్యతిరేకంగా నైజాం రజాకారుల ఆగడాలకు వ్యతిరేకంగా, నేటి బూర్జువా, ప్రైవేటీకరణ విధానాలు అనుసరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన నాటి, నేటితరం నాయకురాలు మల్లు స్వరాజ్యమని కొనియాడారు. ఆనాటి నుంచి నేటి వరకు మహిళలను చైతన్యపర్చి ఆదర్శంగా నిలిచిన నాయకురాలని, ఆమె స్ఫూర్తితో నేడు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల చైతన్యం పెంచుకొని ప్రతి పోరాటంలో మహిళలు ముందుండాలని కోరారు. రెడ్డి వేణు మాట్లాడుతూ ఇఎంఎస్ నంబూద్రిపాద్ విలక్షణ స్థానమని, ప్రజా ఉద్యమాల్లో అగ్రభాగాన నిలుస్తూ, ఎన్నికల ద్వారా ముఖ్యమంత్రి పీఠంమెక్కిన తొలి కమ్యూనిస్టుగా ఆయన్ను ప్రపంచం గుర్తుంచుకుందని తెలిపారు. ఇప్పటికీ కేరళలో అరుణ పతాకం రెపరెపలాడుతుందంటే అందుకు ఆయన వేసిన పునాదులేనన్నారు.

పార్వతీపురంలో నంబూద్రిపాద్, మల్లు స్వరాజ్యంకు నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

దేశంలో మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాలు ప్రజల సంపదను కారుచౌకగా అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని, ఆర్థిక మాంద్యానికి, ఆకలి చావులకు ప్రభుత్వ వైఫల్యాలే కారణమని, కావున మల్లు స్వరాజ్యం, నంబూద్రిపాద్ పోరాట స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.వెంకటరమణ, వి.ఇందిర, ఆర్.లక్ష్మణరావు, జి.కృష్ణ, జివి రమణ, భాస్కర్, సింహాచలం పాల్గొన్నారు.

సాలూరు : సిపిఎం సీనియర్ నేత కామ్రేడ్ ఇఎమ్‌ఎస్ నంబూద్రి పాద్, ఐద్వా సీనియర్ నాయకులు మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా ఆదివారం సిఐటియు, ఐద్వా ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఇఎమ్‌ఎస్ నంబూద్రి పాద్ 25వర్ధంతి, మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.శంకర్, టి.రవి, ఐద్వా నాయకులు టి.స్వప్న, టి.ఇందు పాల్గొన్నారు.

పాచిపెంట: తెలంగాణ సాయుధ పోరాటం యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతి సభ అఖిల భారత మహిళా సంఘం నాయకులు కోరాడ లక్ష్మి అధ్యక్షతన ఆదివారం మండల కేంద్రమైన పాచిపెంటలో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు స్వరాజ్యం చిత్రపటానికి ఐద్వా నేతలు ఎస్ఆర్‌టిపి ఇందిరా దేవి, పి వనజాక్షి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తి వల్ల తెలంగాణ వీర తెలంగాణ ప్రపంచానికి స్ఫూర్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జె.వెంకటరమణ, మహిళా సంఘం ప్రతినిధులు రమణమ్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : మల్లు ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సభ మండల కేంద్రంలో జరిగింది. తొలుత స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలతో నివాళు లర్పించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎ.ఉపేంద్ర, హిమరిక గౌరు నాయుడు, పోలి నాయుడు, సన్యాసిరావు, హెచ్.లక్ష్మ పాల్గొన్నారు.

పాచిపెంటలో మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

భారీ వర్షాలకు కంట్రోల్ రూములు ఏర్పాటు

ప్రజాశక్తి - కలెక్టరేట్

వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు జిల్లాలో కురుస్తున్న వర్షాలకు కలెక్టరేట్‌తో పాటు పార్వతీపురం, పాలకొండ ఆర్‌డిఒ కార్యాలయాల్లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం 08963 - 293046 ఏర్పాటు చేశామని చెప్పారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్‌డిఒ కె.హేమలత తెలిపారు. కంట్రోల్ రూమ్ నెంబర్ ఫోన్ నెంబర్: 8500525011 వద్ద నిరంతరం అందుబాటులో ఉండేలా సిబ్బందిని నియమించామని తెలిపారు. పాలకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్ కాంటాక్ట్ నెంబరు 9493341965లో సిబ్బందిని అందుబాటులో ఉంచామని నెంబర్‌కు సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ తెలిపారు.

ప్రభుత్వ ఐటిఐలో స్కిల్‌హబ్ ఎలా?

అరకొర వసతులతో సతమతమవుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - సాలూరు

అరకొర వసతులతో సతమతమవుతున్న ప్రభుత్వ ఐటిఐలో స్కిల్ హబ్ నిర్వహణ ప్రశ్నార్థకంగా మారుతోంది. గడచిన 12ఏళ్లుగా అద్దె భవనంలో ఉన్న ఐటిఐలో స్కిల్ హబ్ నిర్వహణ అధికారులకు కత్తిమీద సాములా తయారైంది. చాలీచాలని వసతులతో కూడిన అద్దె భవనంలో ప్రభుత్వ ఐటిఐ నడుస్తున్న విషయం ఉన్నతాధికారులకు తెలుసు. ఎనిమిది ట్రేడ్లకు సంబంధించి సుమారు 300మంది విద్యార్థులు ఇరుకు గదుల్లోనే శిక్షణ పొందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యాన ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద స్కిల్ హబ్ మంజూరైంది. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, టూ వీలర్ సర్వీస్ అసిస్టెంట్ కోర్సుల్లో 60మందికి శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మూడు నెలల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమ నిర్వహణకు ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. శిక్షణ అనంతరం సంబంధిత కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం ఉంది. ఐటిఐ, పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సుల్లో శిక్షణ పొందేందుకు అర్హులని ప్రిన్సిపల్ రవికుమార్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్లు ఎ.అశోక్, వై.తిరుపతిరావు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు 9494777553, 9666200617ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. %https://forms.gle/8GwQqCvdjwkPvk%7 లింక్ లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ప్రిన్సిపల్ రవికుమార్, కోఆర్డినేటర్లు కోరారు

శిథిలావస్థలో ఉన్న ఐటిఐ భవనం

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

విజయనగరం : విజయనగరం జిల్లా కౌన్సిల్లో యుటిఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రమేష్‌చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, గౌరవ అధ్యక్షులుగా ఎ.సత్య శ్రీనివాస్, సహాధ్యక్షులుగా వి.ప్రసన్న కుమార్, జి.పార్వతి కోశాధికారిగా సిహెచ్. భాస్కర రావు, కార్యదర్శులుగా ప్రసాద్, వాసు, త్రినాథ్, పి.వాసు, రామినాయుడు, సూర్యా రావు, తిరుపతి నాయుడు, జివి రమణ, రాజారావు, కేశవ, రాధా భవాని, శ్రీదేవి, ఎన్. సత్యనారాయణ ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా కె.విజయగౌరి, డి.రాము, కె.శ్రీనివాసరావు, ఎం.అప్పలనాయుడు, కె.అప్పారావు, జి.పద్మావతి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎ.శంకరరావు ఎన్నికయ్యారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ మాట్లాడుతూ మూడు కిలోమీటర్ల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా, ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షణకు ఉపాధ్యాయులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

జగనన్న విద్యా దీవెన నిధులు విడుదల

ప్రజాశక్తి - కలెక్టరేట్

జగనన్న విద్యాదీవెన నిధులు విడుదల ఆదివారం జరిగింది. జిల్లాలో 19,999 మంది విద్యార్థులు జగనన్న విద్యా దీవెన పథకం కింద అర్హులు కాగా, విద్యార్థుల తల్లులు 18,232 మంది ఖాతాల్లో రూ.11.57 కోట్లు జమయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి అధికారులు, విద్యార్థులు, తల్లులు హాజరయ్యారు. జిల్లాలో వెనుకబడిన కులాల సంక్షేమశాఖ కింద 12,876 మంది విద్యార్థులకు రూ.7.64 కోట్లు, గిరిజన సంక్షేమశాఖ కింద 4,037 మంది విద్యార్థులకు రూ.1.43 కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖ కింద 2,200 మంది విద్యార్థులకు రూ.1.86 కోట్లు, ఒబిసిల సంక్షేమం కింద 650 మంది విద్యార్థులకు రూ.44.80 లక్షలు, కాపు కులాల సంక్షేమం కింద 306 మంది విద్యార్థులకు రూ.16.10 లక్షలు, ముస్లిం మైనారిటీ సంక్షేమం కింద 21మంది విద్యార్థులకు రూ.1.90 లక్షలు, క్రిస్టియన్ మైనారిటీ సంక్షేమం కింద 9మంది విద్యార్థులకు రూ.59 వేలు జమ అయ్యాయి. అలాగే పార్వతీపురం నియోజక వర్గంలో 5,578 మంది విద్యార్థులకు రూ.3.56 కోట్లు, సాలూరు నియోజక వర్గంలో 3,967 మంది విద్యార్థులకు రూ.2.30 కోట్లు, కురుపాం నియోజక వర్గం లో 5,322మంది విద్యార్థులకు రూ.2.88 కోట్లు, పాలకొండ నియోజక వర్గంలో 5,132 మంది విద్యార్థులకు రూ.2.83 కోట్లు అందాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి ఎండి గయాజుద్దీన్, జిల్లా బిసి సంక్షేమ, సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ పర్యవేక్షకులు నీలాద్రి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులకు చెక్కును అందజేస్తున్న జెసి ఆనంద్

70 ఎకరాల్లో అరటి పంట నష్టం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరు, కంబర వలస గ్రామాల్లో అకాల వర్షంతో పాటు పెనుగాలుల వల్ల సుమారు 70 ఎకరాల్లో అరటిపంటకు నష్టం వాటిల్లినట్టు రెవెన్యూ, ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయా గ్రామాల్లోని పంట పొలాలకు వెళ్లి పరిశీలించారు. మరడాన సింహాచలంనాయుడు, నడిమింటి మోహనరావు, బంకురు జగన్నాథం, పోలినాయుడు, దత్తి సత్యంనాయుడు, గోవిందు తదితర రైతులకు చెందిన అరటి పంట పూర్తిగా నాశనమైందని అధికారులు తెలిపారు. పంట చేతికంది వచ్చిన తరుణంలో అకాల వర్షం, పెనుగాలుల కారణంగా పంటలు నాశనమవ్వడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.60 వేలు పెట్టుబడి పెట్టామని, ఈ ఏడాది లాభాలు వచ్చే సమయంలో వీటి ప్రభావంతో పంట నాశనమైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా కంబర, చిట్టిపూడివలస, కిమ్మి, నడిమికెళ్ల, విక్రాంపురం తదితర గ్రామాల్లో అరటిపంట నష్టాలను పరిశీలించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

ఈతమానుగూడ వద్ద కూలిపోయిన జీడిచెట్లు

నేలకొరిగిన జీడి పంట

సీతంపేట ఏజెన్సీలో తుఫాను అకాల వర్షాలకు జీడి, అరటి, మామిడి నేలకొరగడం తో రైతులు ఆందోళన చెందుతున్నారు నిలుగండి, ఈతమానుగూడ, డుంబెంగివలస తదితర ప్రాంతాల్లో ఈ వర్షాలకు జీడి పంట నేలకొరగడంతో పాటు పూత రాలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నడుకూరు అరటిపంట నష్టాన్ని పరిశీలిస్తున్న ఉద్యానశాఖ సిబ్బంది

నీటిఎద్దడిపై పక్కా ప్రణాళిక

- క్రాస్ ప్రోగ్రాం ద్వారా బోర్ల మరమ్మతులు
- ట్యాంకర్ల ద్వారా గిరిశిఖర గ్రామాలకు తాగునీరు సరఫరా
- 'ప్రజాశక్తి'తో ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ప్రభాకర్ ముఖాముఖి



వేసవిలో ప్రజలు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్‌డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఒ.ప్రభాకర్ చెప్పారు. తాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే క్రాస్ ప్రోగ్రాం ద్వారా అన్ని మండలాల్లో చేతిపంపులు, మోటార్ మరమ్మతులు చేపడుతున్నామన్నారు. అలాగే జలజీవన్ మిషన్ పథకం ద్వారా జిల్లాలోని ఇంటింటికి తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే కురుపాం సీతంపేట, గుమ్మలక్ష్మీపురం తదితర మండలాల్లోని గిరిశిఖర గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా ప్రత్యేకించి తాగునీరందజేస్తున్నామని చెప్పారు. అలాగే వేసవిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను 'ప్రజాశక్తి' ముఖాముఖికి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే...

-ప్రజాశక్తి, కలెక్టరేట్

? వేసవిలో తాగు నీటి కొరతను ఎదుర్కొనేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో తాగునీటి కొరతను దృష్టిలో పెట్టుకొని ఏ ఏ ప్రాంతాల్లో నీటి కొరత తీవ్రంగా ఉందో గుర్తించాం. తాగునీటి కొరతను అధిగమించేందుకు తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. జనవరి నుంచి జూన్ వరకు యాక్షన్ ప్లాన్ తయారు చేశాం.

? క్రాస్ ప్రోగ్రాం ద్వారా ఏ ఏ పనులు చేయనున్నారు?

క్రాస్ ప్రోగ్రాం ద్వారా ఇప్పటికే జిల్లాలో 15 మండలాల్లో 7,500 చేతిపంపులకు గ్రీజింగ్, ఆయిలింగ్ మరమ్మతు పనులు చేయించి చేతిపంపులన్నీ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. చేతి పంపుల మరమ్మతులు ప్రక్రియ మార్చి 15 నుంచి ప్రారంభమై ఏప్రిల్ 30 వరకు కొనసాగుతుంది. 15వ ఆర్థిక సంఘం నిధులతో క్రాస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నాం.

? గిరి శిఖర గ్రామాల్లో తాగునీటి కొరత పరిష్కారానికి తీసుకున్న చర్యలేమిటి?

జిల్లాలో ఎక్కువగా నీటి కొరత ఉండే కురుపాం, సీతంపేట మండలాల్లోని గిరిశిఖర గ్రామాలకు నీటి సమస్య పరిష్కారం కోసం అవసరమైన గ్రామాలకు మంచినీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసి తాగునీరందజేస్తాం.

? జలజీవన్ మిషన్ ప్రాముఖ్యత ఏమిటి

జలజీవన్ మిషన్ (జెజెఎం) పథకం ద్వారా 2024 సంవత్సరం కల్లా జిల్లాలోని ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి ఏర్పాటు చేయడం. ప్రతి మనిషికి సుమారు 55 లీటర్ల చొప్పున మంచినీటి సరఫరా చేస్తున్నాం.

? జెజెఎం ద్వారా జిల్లాలో ఎన్ని పనులు పూర్తయ్యాయి?

జిల్లాకు జల జీవన మిషన్ ద్వారా రూ.519 కోట్ల అంచనా విలువతో 2959 పనులు మంజూరు చేయగా, వీటిలో రూ.119 కోట్లతో 1316 పనులు ప్రారంభమయ్యాయి. వీటిలో అంచనా విలువ రూ.20 కోట్లతో 750 పనులు పూర్తి చేయగా, ఇంకా రూ.5కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. మిగిలిన పనుల కోసం టెండర్లు పిలిచి, పోస్ట్ చేయనున్నాం.

చిత్తడిగా మారిన పాలకొండ ప్రధాన రహదారి

చినుకు పడితే చిత్తడే

పాలకొండ: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీగా వర్షాలకు పాలకొండ పట్టణం తడిచి ముద్దయింది. పలు వీధులతో పాటు ప్రధాన రహదారి చిత్తడిగా మారింది. ముఖ్యంగా ప్రధాన కూడళ్లలో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గర నీరు విపరీతంగా పారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వాహనదారులు వాహనాలు నడపడానికి కూడా భయాందోళన చెందారు. నగర పంచాయతీ అధికారులు దీనిపైన పట్టించుకునే పరిస్థితి లేదు. దీంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి చెందారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ అప్పారావు

ప్రజాసమస్యలు పరిష్కరించండి

కొమరాడ: ప్రజలు తమ సమస్యలు తెలియజేసి వెంటనే అధికారులు స్పందించి తక్షణమే పరిష్కరించాలని ఎంపిపి శెట్టి శ్యామల, జడ్పిటిసి డి.లక్ష్మి కోరారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు హాజరయ్యారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోడ్ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటిస్తూ సమావేశం జరిపించారు. ముఖ్యంగా వేసవిలో తాగునీటి సమస్య లేకుండా క్రాస్ ప్రోగ్రాం ద్వారా పనులు చేపట్టి తాగునీటి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపి ఎన్.శరత్‌బాబు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వైసిపి సీనియర్ నాయకులు బత్తుల మృతి

మక్కువ : మండలంలోని దబ్బగెడ్డకు చెందిన వైసిపి సీనియర్ నాయకులు బత్తుల తిరుపతి నాయుడు (52) ఆకస్మికంగా మృతి చెందారు. శనివారం రాత్రి విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ హఠాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. ఆదివారం తిరుపతి నాయుడు సొంత గ్రామమైన దబ్బగెడ్డకు భౌతికకాయాన్ని తీసుకొచ్చారు. జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు నాయుడు, వైసిపి నాయకులు మావుడి రంగునాయుడు, తిరుపతినాయుడు హుటా హుటిన దబ్బగెడ్డకు వచ్చి తిరుపతినాయుడు భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. అలాగే మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపిటిపి సభ్యులు, వైసిసి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకొని నివాళులర్పించారు.

బాలరాజును అభినందిస్తున్న ఫెన్సింగ్ అసోసియేషన్ సభ్యులు

జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు గిరిజన క్రీడాకారుడు

గుమ్మలక్ష్మీపురం : జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు గిరిజన క్రీడా కారుడు ఎంపికవడంతో ఈప్రాంత ప్రజలు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 11,12 తేదీల్లో కాకినాడలోని ద్రోణ బాడ్మింటన్ అకాడమీ వేదికగా జరిగిన 9వ రాష్ట్రస్థాయి స్త్రీ, పురుషుల సీనియర్ ఫెన్సింగ్ క్రీడా పోటీలో మండలానికి చెందిన పత్తిక బాలరాజు ఫెన్సింగ్‌లో వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించాడు. మహారాష్ట్ర లోని పూణే పట్టణంలో మార్చి 25,26,27,28 తేదీల్లో జరగనున్న జాతీయ స్థాయి స్త్రీ , పురుషుల సీనియర్ ఫెన్సింగ్ క్రీడా పోటీలకు అర్హత సాధించాడు. ఈ మేరకు డివి చారి, డిస్ట్రిక్ట్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, ఫెన్సింగ్ అసోసియేషన్ అఫ్ ఆంధ్రప్రదేశ్ జాయింట్ సెక్రటరీ, ఫెన్సింగ్ అసోసియేషన్ అఫ్ విజయనగరం వర్కింగ్ ప్రెసిడెంట్, పి.అనిల్ కుమార్ (ఫెన్సింగ్ కోచ్ డెంకాడ)ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలి

కురుపాం : మండలంలో ఉదయపురం పంచాయతీ కాకితాడ గ్రామంలో సీతారామ స్వామి ఆలయం నిర్మాణం జరుగుతున్న సందర్భంగా దాతలు సహకరించాలని సర్పంచ్ అరుణ కుమారి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో సీతారామస్వామి ఆలయం నిర్మాణం చేపడుతున్న సందర్భంగా కొంత మంది దాతలు సహకారంతో స్లాబ్ వరకు వచ్చిందని ఆదివారం స్లాబ్ వేయడం జరిగిందని అన్నారు. ఇంకా గుడి పనులు పూర్తి అవ్వడానికి చాలా నిధులు అవసరం ఉన్నందున దాతలు ఎవరైనా ఉంటే వారికి తోచింది సహాయం చేసి నిర్మాణానికి తోడ్పడాలని కోరారు.

ఎందుకీ పనులు?

పాలకొండ: నగర పంచాయతీలో ప్రజలు కొద్దిరోజులుగా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నాన్ అమృత పథకం మంజూరు కావడంతో ట్యాంకుల నిర్మాణం జరగకుండానే పైపులైన్లు వేయడం, రోడ్లు తవ్వడంతో పలు వీధులు అధ్వాన్నంగా మారాయి. అదే విధంగా బాగున్న రోడ్లు కూడా పనులు చేయడానికి అధికారులు జేసిబిలతో రోడ్లను దెబ్బతీసేలా పనులు చేయించడంతో రహదారులన్నీ అధ్వాన్నంగా తయారయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

భారీ అన్నదానం

వీరఘట్టం : స్థానిక కోట దుర్గ అమ్మవారి ఆలయ పునప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా సర్వ జోషులు శ్రీ వెంకటలక్ష్మి నరసింహశర్మ యాజి ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు రూ.కోటీ60 లక్షలతో కోట దుర్గమ్మ అమ్మవారి ఆలయాన్ని పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ఈనెల 16 నుంచి 18 వరకు ఆలయ నిర్మాణానికి సహకరించిన 250మంది దాతలకు వేదపండితులచే ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లాతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ, ఒడిశా రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

అన్నదానానికి హాజరైన వివిధ గ్రామాల ప్రజలు

తాగునీటి సరఫరాకు బ్రేకులు

మరమ్మతులు గురైన ప్రధాన పైపులైను
గుక్కెడు నీటి కోసం ప్రజలు ఆరాటం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని పలు గ్రామాలకు తాగునీరు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు దాహం కేకలు పెడుతున్నారు. మండలంలోని వండవ ఉపరితల రక్షిత మంచినీటి పథకం ప్రధాన పైపులైను మరమ్మతులు గురికావడంతో గత నాలుగు రోజులుగా తాగునీరు సరఫరా నిలిచిపోయింది. ఈ పథకం ద్వారా రేగులపాడు, చిదిమి, తూడి, యు వెంకంపేట, పివిఆర్ పురం, కత్తుల కవిటి, చేబియ్యవలస, ఎం.రాజపురం, వండువ, ఆడరు, డిపి వలస, బిటువాడ, ఎంవి పురం, పాపంపేట, బొడ్లపాడు, సుంగరాయపురం, హుస్సేన్‌పురం, వంకాయలగెడ్డ తదితర గ్రామానికి తాగునీరు సరఫరా అవుతుంది. అయితే ప్రధాన పైపులైన్లు మరమ్మతులకు గురికావడంతో పలు గ్రామాల్లోని ప్రజలు తాగునీటికి బోర్లు బావులపై ఆధారపడగా, మరికొన్ని గ్రామాల ప్రజలు నాగావళి నదిలో చలమల ద్వారా నీరు తోడుకొని దాహార్తిని తీర్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఉత్సవ విగ్రహాల్లా రక్షిత పథకాలు

మండలంలోని పాపంపేట, ఎం.రాజపురం, సిఎస్ఆర్‌పేట గ్రామాల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రక్షిత మంచిని పథకాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. ఈ పథకాల వద్ద బోరు బావులు ఏర్పాటు చేయకపోవడంతో వండవ ఉపరితల పథకం ద్వారా వచ్చే నీటిని పథకాలకు ఎక్కించి తద్వారా ప్రజలకు కుళాయి పాయింట్ల ద్వారా తాగునీరు సరఫరా చేయడం ఆనవాయితీగా వస్తుంది. ప్రధాన పైపులైన్ మరమ్మతులు గురికావడంతో లక్షలాది రూపాయలతో వెచ్చించిన రక్షిత మంచినీటి పథకాలు ఉత్సవ విగ్రహల్లా మారాయి. పేరు గొప్ప ఊరు దెబ్బ అన్న చందంగా పథకాలే ఉన్నాయి తప్ప గుక్కెడు నీటి చుక్కలు ఇవ్వడంలో మొరాయించాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత నాలుగు రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నప్పటికీ కనీసం అధికారులు, పాలకులు వీటిపై దృష్టి సారించక పోవడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రక్షిత మంచినీటి పథకం మరమ్మతులు చేపట్టి తక్షణమే తాగునీరు సరఫరా చేసేందుకు తగు చర్యలు తీసు కోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాపంపేట గ్రామంలో ఉత్సవ విగ్రహాల దర్శనమిస్తున్న రక్షిత పథకం

నాగావళి నదిలో చెలమల నీరు పట్టుకుంటున్న బిటివాడ గ్రామమహిళలు

అంటి కొండలో తాగునీటి సమస్య

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని పెద్దగూడ పంచాయితీ పరిధిలో ఉన్న అంటికొండ గ్రామంలో నీటి సమస్య రోజు రోజుకు తీవ్రరూపం దాల్చుతోంది. ఆ గ్రామంలో సుమారు 60 కుటుంబాలు నివస్తిస్తున్నాయి. ఇక్కడ గిరిజనులు ఏళ్ల తరబడి తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. గుక్కెడు తాగునీటి కోసం ఆదివాసీలు విలవిల్లాడుతున్నారు. గ్రామంలోని మహిళలు, పురుషులు, పెద్ద చిన్న తేడా లేకుండా కిలో మీటర్ దూరంలో ఉన్న భావి నుంచి తాగునీటిని మోసుకొని తెచ్చి దాహార్తిని తీర్చుకుంటున్న దుస్థితి నెలకొంది. అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వాలు మారిన తమ కష్టాలు తీరడం లేదని అక్కడి గిరిజన ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఐటిడిఎ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మంచి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పవన్ కుమార్ వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించుగా తాగునీటి సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే నీటి ఎద్దడి గ్రామాలు పై సర్వే చేపట్టామని అన్నారు.

కాలువల్లో, రోడ్లపై భవన వ్యర్థాలు

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో గల పురాతన భవన నిర్మాణాలను యజమానులు తొలగిస్తున్నాయి. అయితే శిథిలాలను బయటకు తరలించకుండా రోడ్లపైనే, కాలువల్లోనే విడిచిపెడుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారుల ఆమోదం లేకుండానే సంబంధిత భవన యజమానులు ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలను తొలగిస్తున్నారు. ఆ శిథిలాలను ఆయా వీధుల్లోని రహదారులపైనా, మురుగు కాలువలోనే పేరుకుపోయాయి. దీంతో నివాస గృహాల వాడుక నీరు ప్రవహించేందుకు మార్గం లేక ఆయా ప్రాంతాల్లో తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో పాటు, ఆయా ప్రధాన రహదారుల్లో రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు పలు ఇబ్బందులకు గురై ప్రమాదాల బారినపడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఆయా ప్రాంతాల్లోని సచివాలయాల, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు పట్టణంలోని పలువార్డుల్లో జరుగుతున్న భవన నిర్మాణ పనులపై సంబంధిత యజమానులకు నోటీసులు అందజేసి రోడ్లపైనా, కాలువల్లో ఉండే చెత్తాచెదారాలను తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డబ్రిస్‌తో కప్పబడ్డ మురుగు కాలువ

పట్టభద్రులకు కృతజ్ఞతలు : శత్రుచర్ల

ప్రజాశక్తి- జియ్యమ్మవలస

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి చిరంజీవి రావును గెలిపించిన పట్టభద్రులకు మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి జగదీశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం చిన్న మేరంగి శత్రుచర్ల నివాసంలో నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు పట్టభద్రుల ఎమ్మెల్సీ విజయోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేకాన్ని తెలియజేస్తూ పట్టభద్రులు మొదట ప్రాధాన్యత ఓటును వేసి చిరంజీవి రావును గెలిపించడం టిడిపి శ్రేణుల్లో ఉత్సాహం పెరిగిందన్నారు. గెలుపు కోసం కృషి చేసిన నాయకులు కార్యకర్తలకు అభినందనలు తెలియజేశారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. ఆదివారం ఆ పార్టీ జిల్లా నాయకులు విలేకరులతో మాట్లాడుతూ, పార్వతీపురం మన్యం జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గాను జిల్లాలోని మండలాల్లో రైతులకు పంట నష్టం ఏర్పడిందన్నారు. దీనిలో భాగంగా మామిడి, జీడి మామిడి, మొక్కజొన్న, కూరగాయలు, బొప్పాయి, పత్తి, అరటి తదితర పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో పంట నష్టపోయిన రైతులను గుర్తించి వారికి పంట నష్టపరిహారం ఇవ్వాలన్నారు. అమ్మకం కానీ ధాన్యం ఈ వర్షానికి తడిసి పాడైన వాటికి కూడా నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగల దాలి నాయుడు, బంటు శిరీస్, రాజాన రాంబాబు, కే.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిఐటియు, రైతు సంఘం నాయకులు, రైతులు

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఇటీవల కురిసిన వర్షాలకు, గాలులకు, ఏనుగుల సంచారం వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం, సిఐటియు నాయకులు ఎ.ఉపేంద్ర, కె.సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతులతో కలిసి వారు మండల కేంద్రంలో ఆదివారం నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు రాధాకృష్ణకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అకాల వర్షాలు, ఏనుగుల వల్ల బొప్పాయి, టమాట, మొక్కజొన్న, అరటి తదితర పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. అకాల వర్షాలకు పంట పూర్తిగా నేలకొరిగి నష్టం జరిగిందని, మరోవైపు ఏనుగుల వల్ల కూడా పంట నష్టం జరుగుతుందని తెలిపారు. కావున ఇటు తుఫాను వల్ల అటు ఏనుగుల వల్ల నష్టపోతున్న పంటలను పరిశీలించి అన్ని విధాలా పంటలు పోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మధుసూదనరావు, సాయిరాం, అక్కులనాయుడు, శివున్నాయుడు, చిన్నంనాయుడు, సింహాచలం, తిరుపతి, పోలి నాయుడు, గురువులు, సింహాచలం, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఎస్‌టిలకు కరెంటు బిల్లులు

బాడంగి : మండలంలోని ఎరుకలపాకల గ్రామంలో ఎస్‌టిలకు కరెంటు బిల్లులు ఇస్తున్నారని గజరాయనివలస ఎంపిటిసి పాలవలస గౌరు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్‌టిలకు 200 యూనిట్ల వరకు కరెంటు ఉచితమని ప్రభుత్వం చెప్పినప్పటికీ అధికారులు బిల్లులు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. 100 యూనిట్లు వాడినా అధిక బిల్లులు వేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

నేడు బైక్ వేలం

వంగర : మద్యం కేసులో పట్టుబడిన సిబిజెడ్ వాహనం రాజాం ఎస్‌ఈబి కార్యాలయంలో నేడు వేలం వేనున్నట్లు వంగర ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు తెలిపారు. వేలంలో పాల్గొనలను కునేవారు రాజాంలో గల ఎస్‌ఈబి కార్యాలయం లో సోమవారం సంప్రదించాలని తెలిపారు.

స్పందనకు హాజరవ్వండి

వంగర : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరగబోయే స్పందన కార్యక్రమానికి మండల స్థాయి వివిధ శాఖల అధికారులతో పాటు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

శిక్షణార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న సీనియర్ మేనేజర్ మురళి

అప్రెంటీస్ సర్టిఫికెట్లతో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అప్రెంటిస్ సర్టిఫికెట్ల ద్వారా అభ్యర్థులకు చక్కని ఉద్యోగ అవకాశాలు ఉంటాయని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ పార్వతీపురం బ్రాంచ్ సీనియర్ మేనేజర్ బి.మురళి అన్నారు. ఆదివారం స్థానిక వాసవి, గాయత్రి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులకు ఇండియా పోస్ట్ బ్యాంకు ద్వారా అప్రెంటిస్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వానికి చెందిన ఇండియా పోస్ట్ పేమెంట్ల బ్యాంకు ద్వారా అప్రెంటిస్ పొందిన విద్యార్థులకు చక్కని అవకాశం ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాంక్ తదితర కాంపిటేటివ్లో ఈ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయన్నారు. కళాశాల కరస్పాండెంట్ పివికె మణికుమార్ చొరవతో తమ ఇండియన్ పోస్టల్ బ్యాంకు ద్వారా విద్యార్థులకు 90 రోజుల పాటు విద్యార్థులకు అప్రెంటీస్ అవకాశం కల్పించామన్నారు. అప్రెంటిస్ కాలాన్ని చక్కగా క్రమశిక్షణతో పూర్తి చేసుకున్న విద్యార్థులను అభినం దిస్తూ సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులు భవిష్యత్తులో కాంపిటేటివ్‌పై దృష్టి సారించి ఉద్యోగాలు సంపాదించాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ మేనేజర్ సిహెచ్ సాగర్ అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శర్మ, ఎఒలు గౌరీ శంకర్, శ్రీనివాసరావు ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు మేనేజర్లు బి.మురళి, సి.హెచ్.సాగర్, హేమంత్, సంతోష్‌ను దుస్సాలువతో సత్కరించారు.

మనసున్న మారాజులు

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీ పురం గ్రామంలో ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న యాత్ర సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన సర్కస్, మ్యూజియం నిర్వాహకులు తుఫాను కారణంగా ఎటువంటి ఉపాధి లేక నిరాశ్రయులయ్యారు. పిల్లాపాపలతో భోజనాలకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన సర్పంచ్ బి.గౌరీ శంకర్రావు, యాత్ర కమిటీ సభ్యులు భోజనాలు ఏర్పాటు చేసి అందించారు. ఇందుకోసం పలువురు దాతలు విరాళాలు కూడా అందించారు. భోజనాలు అందించిన సర్పంచ్‌కు, దాతలకు వారు ధన్యవాదాలు తెలిపారు. నిరాశ్రయులకు భోజనాలు పెట్టడం పట్ల గ్రామస్తులు అభినందించారు.

నిరాశ్రయులకు భోజనాలు వడ్డిస్తున్న సర్పంచ్, గ్రామయువత

నిర్మాత కుటుంబాన్ని పరామర్శించిన కళా

రేగిడి: మండలంలోని వావిలవలసకు చెందిన మిథునం నిర్మాత ముయిద ఆనందరావు మృతి చెందడంతో ఆయన సోదరుడు వైసిపి నాయకులు ముయిద ప్రసాదరావు, సర్పంచ్ ప్రసన్న లక్ష్మి కుటుంబాన్ని మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు ఆదివారం పరామర్శించారు. ఆనందరావు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు విద్యారంగంలో సృజనాత్మకత అందించడంలోనూ, పారిశ్రామికవేత్తగా, సినీ నిర్మాతగా ఎంతో పేరు ప్రఖ్యాత సంపాదించారని అన్నారు. ఆయన లేని లోటు రాజాం ప్రాంతానికే తీరనిలోటని విచారణ వ్యక్తం చేశారు.

జాగ్రత్తలతో మొక్కజొన్నను కాపాడుకోవచ్చు

ప్రజాశక్తి - పాచిపెంట

అధికవర్షాల నుంచి మొక్కజొన్న పంటను చిన్నచిన్న జాత్రలు పాటిస్తే కాపాడుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు తెలిపారు. ఇటీవల కురుస్తున్న భారీ గాలులు, వర్షాలకు మొక్కజొన్నకు పెద్దగా నష్టం వాటిల్లలేదన్నారు. కొన్నిచోట్ల ఆలస్యంగా ఆలస్యంగా నాటిన మొక్కజొన్న పంట ఉందని, దాన్ని కూడా గాలుల నుంచి కాపాడుకోవచ్చునని తెలిపారు. మండలంలో ప్రస్తుతం 3342 ఎకరాల్లో మొక్కజొన్న సాగులో ఉందన్నారు. ఆలస్యంగా నాటిన మొక్కజొన్నలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. వీలైతే వరుసల మధ్యలో గొప్పు తవ్వించి ఎకరాకు 50కేజీల యూరియా, 15 నుంచి 20 కేజీల పొటాష్ కలిపి వేసుకోవాలని తెలిపారు. వర్షాలు తగ్గిన తర్వాత వచ్చే వేడిమికి తెగుళ్ల ఆశించే అవకాశం ఉన్నందున ఎకరానికి 200 మిల్లీలీటర్ల ట్రాఫిక్ ఓనజోల్, 200 మిల్లీలీటర్ల ఇమీడా క్లోప్రిడ్ పిచికారీ చేసుకోవడం ద్వారా రసం పీల్చు పురుగులను, ఆకు ఎండు లేదా ఆకు మచ్చ తెగుళ్లను నివారించుకోవచ్చని రైతులకు సూచించారు. పంట కోసేసి తడిచిపోయిన గింజలపై మొలకెత్తకుండా ఉండాలంటే ఐదు శాతం గెడ్డ ఉప్పు లేదా ద్రావణాన్ని పిచికారి చేసుకుని ఎండ ఎక్కిన వెంటనే ఆరబెట్టుకోవాలన్నారు. దీనివల్ల మొలక రాకుండా వారం రోజులు పాటు నిల్వ చేసుకోవచ్చు అని తెలిపారు. ఆలస్యంగా నాటిన మొక్కజొన్న మతుమూరు, పాంచాలి, కొటికి పెంట రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఉందని ఇప్పటికైతే ఎలాంటి నష్టం జరగలేదని తెలిపారు. పంట నష్టం జరిగినట్లయితే వెంటనే కలెక్టర్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేస్తామన్నారు.

మొక్కజొన్న సంరక్షణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

దండోరా ప్రకటన

రేఖా సంఖ్యా :- 15/2022-23 తే.20.03.2023ది.

పార్వతీపురం మన్యం జిల్లా, వీరఘట్టం మండలం, వీరఘట్టం గ్రామ పంచాయితీకి చెందిన ఈ దిగువ నుదహరించిన షెడ్యులు-I లో గల గుత్తలు 2023-24 సంవత్సరమునకు గుత్తలు హక్కులు పొందుటకు గాను వీరఘట్టం గ్రామ పంచాయితీలో పంచాయితీ కార్యదర్శి వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని తే 24-03-2023 శుక్రవారం ఉదయం గం.11-00లు నుండి వీరఘట్టాం గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద బహిరంగ వేలం వేయబడును. మరియు ఈదిగువ నుదహరించిన షెడ్యులు-II లో సీలు వేసిన టెండర్లు తే 24-03-2023 ది శుక్రవారం ఉదయం గం॥ 11-00 లు నుండి గం॥ 1-00 వరకు స్వీకరించబడును. ఆదేరోజు మధ్యాహ్నం గం॥ 2-00 లు కు టెండరుదారుల సమక్షములో తెరవబడును.

మరియు వేలం పాటలో పాల్గొన దలచిన వారు శ్రీ విస్తరణాధికారి పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి, వీరఘట్టాం వారిచే సాల్వెన్సీ దృవపత్రం రు.50,000/-లువరకు (అక్షరాల యాభై వేల రూపాయులు మాత్రమే) మరియు రూ 1,00,000/- (అక్షరాలా ఒక లక్ష రూపాయిలు మాత్రమే) శ్రీ డివిజనలు పంచాయితీ అధికారి, పాలకొండ వారిచే సాల్వేన్సి ధ్రువ పత్రం విలువ గలది వేలం పాటలకు ముందుగా ఈ దిగువ సంతకం దారునకు సమర్పించి షెడ్యులు-I నందు చూపిన ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొన వలెను. మరియు షెడ్యులు-II లో టెండర్లు కు ధరావత్తు చెల్లించి టెండర్లు వేయవలెను. మరియు ఇతర వివరములు షరతుల ఈ గ్రామ పంచాయితీ కార్యాలయం పనిచేయు వేళలందు అడిగి తెలుసుకోవచ్చును.

షెడ్యులు-I

వ.నెం	గుత్తలు వివరములు	సంవత్సరము	ధరావత్తు
1	రోజువారీ మార్కెట్	2023-24	20000
2	బస్సు & కార్లు స్టాండ్ (లారీలు మరియు R.T.C బస్సులు మినహా)	2023-24	5000
3	పాత బస్టాండ్ లోని షాపింగ్ కాంప్లెక్స్ లో 6 షాపులు మరియు పంచయితీ ఎదురుగా ఉన్న 8 షాపులకు (ఒక షాప్ ఒక్కంటికి)	2023-24	10000
4	పాత బస్టాండ్ లోని 9 వ ప్లాట్లు ఆక్రమించుకొనుటకు (ప్లాట్ ఒక్కంటికి)	2023-24	7500(plot-9)
5	పాత బస్టాండ్ లోని 10 వ ప్లాట్లు ఆక్రమించుకొనుటకు (ప్లాట్ ఒక్కంటికి)	2023-24	1,7500(plot-10)

వి.రామచంద్ర రావు, కార్యనిర్వహణాధికారి,
(పంచాయితీ కార్యదర్శి), గ్రామ పంచాయితీ,